ఉపాధ్యాయుల కొరతతో చతికిలబడి

- మున్సిపల్ పాఠశాలలను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- సమస్యల మధ్య విద్యార్థుల చదువులు

మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల వివరాలు

ఉన్నత పాఠశాలలు	- 5
ప్రాథమికోన్నత పాఠశాలలు	- 1
ప్రాథమిక పాఠశాలలు	- 30
ఉపాధ్యాయుల కొరత	- 45 మంది (సుమారు)



వివేకానంద మున్సిపల్‌ఉన్నత పాఠశాల



తరగతి గదిలో కిక్కిరిసిన విద్యార్థులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మున్సిపాలిటీలోని మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు టీచర్లు లేకపోవడంతో బోధన కష్టతరంగా మారింది. ముఖ్యమైన సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పలు పాఠశాల్లో నియమించాల్సి ఉంది.

వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో...
స్థానిక రాంరెడ్డి లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ పాఠశాలలో 41 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 24 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ పాఠశాలలోల 1110 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతి గదులు 24 ఉన్నాయి. వీటిలో స్టోరు, ల్యాబ్ ఇతర సామగ్రి ఉంచడానికి రెండు గదులు కేటాయించారు. విద్యార్థులకు 20 గదులు మాత్రమే ఉన్నాయి. తరగతి గదుల కొరత కూడా సమస్యగా మారింది. తెలుగు, హిందీ సబ్జెక్టులకు ఒక్కరే ఉపాధ్యాయులున్నారు. వాల్మీకినగర్ మున్సిపల్ పాఠశాలలో 210 మంది విద్యార్థులకు కేవలం నలుగురు టీచర్లు ఉన్నారు. నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 6 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది .దీంతో పాటు అమ్మచెరువుమిట్ట, మాయా బజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, చంద్రకాలనీ, బాలాజీ నగర్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది.

సర్దుబాటులోనైనా ఉపాధ్యాయులు వస్తారా ?
ప్రభుత్వం టీచర్లు సర్దుబాటు చేస్తామని ప్రకటించారు. అయితే ఉపాధ్యాయ సంఘాలకు,విద్యాశాఖకు మధ్య వివాదం తెలత్తడంతో ప్రకియ వాయిదా పడింది. దీంతో సర్దుబాటులో ఉపాధ్యాయులు ఇప్పటికే వచ్చే అవకాశాలు కన్పించడం లేదు. పాఠశాలకు తెరిచి 45 రోజులు గడిచినా ఉపాధ్యాయుల నియామకంపై ప్రభుత్వం యంత్రాంగం దృష్టి సారించలేదు.

ఉపాధ్యాయులను నియమించాలి



మున్సిపాలిటీలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి. ఉపాధ్యాయులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. ఇప్పటికైనా అధికారుల చొరవ చూపాలి.
– పురం వెంకటరమణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం : మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా దృష్టి సారించాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయ సమావేశ భవనంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా నివేదికలు తయారు చేయాలన్నారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరే విధంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున రెడ్డి, క్రిష్టారెడ్డి, వల్లిగట్ల వెంకట్రమణ, సురేంద్ర వర్మ, శేషాద్రి రెడ్డి, కోసూరి రమేష్, చంద్రమౌళి, గాంధీపేట రమణ, పివి నారాయణ, రాజేంద్రాచారి, సయ్యద్‌బాషా, రామక్రిష్ణ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలను పట్టించుకోరా?

- ఇసుకాసురులను రక్షించే పనిలో రెవెన్యూ యంత్రాంగం
- సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు



ఇసుక అక్రమ నిల్వలను చూపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లె : పక్కా ఆధారాలతో ఇసుక, మట్టి అక్రమ నిల్వలు పట్టించినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక నిల్వ చేసిన ప్రదేశాలను సాక్ష్యాధారాలతో చూపించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ బసినికొండ దగ్గర రెండు చోట్ల, ఎస్‌బీఐ కాలనీలో ఒక చోట ఉన్న ఇసుక స్థావరాలను కనిపెట్టి అధికారులకు పిర్యాదు చేశానన్నారు. దీనిపై మైనింగ్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదని, మదనపల్లె తహసీల్దార్‌కు తెలిపితే... నాకు సంబంధం లేదు, సెబ్ అధికారులకు ఫిర్యాదు చేయమని బాధ్యతా రాహిత్యంగా మాట్లాడినట్లు తెలిపారు. సెబ్ అధికారులు ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదని, టూటౌన్ పోలీసులు స్పందించినా ఇసుక నిల్వలకు, మాకు సంబంధం లేదని, వాహనంలో ఉంటేనే సీజ్ చేస్తామని చెప్పారన్నారు. తహసీల్దార్ మైనింగ్ మాఫియాపై మెతక వైఖరితో ఉండటంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. మైనింగ్ మాఫియా ఆగడాలు అరికట్టాలి అంటే ప్రజా ఉద్యమమే పరిష్కారమన్నారు. అందుకు సీపీఎం అగ్రభాగాన ఉంటుందని ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హరి శర్మ, చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తి విగ్రహం ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న గొల్లపూడి తిరుపతిరావు

మదనపల్లె సిటీ : ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు పురాణం తాగ్యమూర్తిశర్మ విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రజా చైతన్య ప్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైతన్య ప్రవంతి ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన ప్రముఖ రచయిత పురాణం త్యాగమూర్తి సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. విశ్రాంత బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులురెడ్డి ఆయన విగ్రహానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానని ప్రకటించారు. మురళీధరరావు రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. ఇందుకోసం కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతిరావు తెలిపారు. ప్రతి ఏటా ఆయన పేరు మీద పండితునికి పురస్కారం ప్రధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగభూషణరావు, ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి,భవానీప్రసాద్, నరసింహులు, రామకృష్ణ, సూర్యనారాయణ, మునిగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులను గుర్తించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి

కలకడ : పంచాయతీల అభివృద్ధికి గ్రామాల వారి ఆదాయ వనరులను గుర్తించాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి పంచాయతీల అభివృద్ధికి వార్షిక ప్రణాళికపై సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి మూడవ రోజు శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా పంచాయతీల ఆదాయ వనరులు గుర్తించాలని సూచించారు. ఇంటిపన్ను వసూలు, చెత్తసేకరణ, ఆదాయం పెంపుదల, చెరువులు, కాలువల అభివృద్ధి, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకునేందుకు సర్పంచ్‌ల కృషి అవసరమన్నారు. పంచాయతీలు అభివృద్ధి చెందినప్పుడే గాంధిజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జిల్లా రాజగోపాల్‌రెడ్డి, విశ్వనాథ్, ప్యారీజాన్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి అన్నారు. బుధవారం ఆయన శీలంవారిపల్లి పంచాయతీ గుంతావారిపల్లెలో పర్యటించారు. సర్పంచ్ నాగిరెడ్డి ఇంటిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. నియోజవర్గంలో జరగాల్సిన అభివృద్ధిపై సమీక్షించారు. వైఎస్‌ఆర్సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో రూ.వేలకోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగనంత అభివృద్ధి వైఎస్‌ఆర్సీపీ ప్రభుత్వంలో జరిగిందన్నది వాస్తవమని నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగాల్సి ఉందని ఎమ్మెల్యే అన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కాగా మంగళవారం రాత్రి మండలంలోని బడికాయలపల్లి, బి.కొత్తకోటలో ఎమ్మెల్యే పర్యటించారు. బడికాయలపల్లిలో పార్టీ నాయకుడు రెడ్డీశ్వరను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రదీప్ రెడ్డి ఇంటిలో పార్టీ కార్యకర్తలు నాయకులతో సమావేశం అయ్యారు. బి.కొత్తకోటలో హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ బలరాం రెడ్డిని పరామర్శించారు.

నిబంధనలకు లోబడి ఆటోలు నడపాలి



ఆటో డ్రైవర్లకు పోలీస్ స్టిక్కర్లు అందజేస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణ

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో అధిక సంఖ్యలో ఆటోలు ఉన్నాయని, నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలని ఎస్‌ఐ బాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఫిరోజ్ ఫంక్షన్ హాల్‌లో బిస్మిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో ట్రాఫిక సమస్య అధికంగా ఉందని, పరిష్కారానికి ఆటో డ్రైవర్లు సహకరించాలన్నారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆటోలకు పోలీస్ స్టిక్కర్లు అందజేశారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం ఐఎన్‌టీయూసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా బోదేషావల్లికి నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మురళీధర్, నాయకులు హుమయూన్, సోనాబాయి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలి



మదనపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద మాలమహానాడు నాయకుల నిరసన

మదనపల్లె : ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని సంఘర్ష్ సమితి రిజర్వేషన్ బచావో పేరుతో బుధవారం నిర్వహించిన భారత్‌బంద్ నిరసన ప్రదర్శనలకే పరిమితమైంది. బంద్‌ను పురస్కరించుకుని ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన పాఠశాలలకు, కళాశాలలకు ముందస్తు సెలవులు ప్రకటించారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి, ప్రభుత్వశాఖల కార్యాలయాలు, వ్యాపారసంస్థలు, దుకాణాలు కార్యకలాపాలు కొనసాగించాయి. మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం, చంద్రయ్య, గుండామనోహర్, మల్లెలమోహన్, లక్ష్మీపతి, కొప్పలరమణ, ఆటోరమణ, విజయ్, శ్రీరాములు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి విరుద్ధమని మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య అన్నారు. బుధవారం భారత్ బంద్‌ను పురస్కరించుకొని పట్టణంలోని విద్యాలయాలు, వ్యాపార దుఖాణాలను మూయించి బంద్‌ను నిర్వహించారు. మాలమహానాడు నాయకులు శివయ్య, విఠలం వెంకటస్వామి, శ్రీనివాసులు, రఘు, ప్రవీణ్, అశోక్, సూరి, సుబ్రహ్మణ్యం, సురేంద్ర, రమణ, రాజన్న, భాస్కర, ఇరగప్ప, క్రిష్ణయ్య, నాగయ్య, రమణయ్య, శేఖర్, శ్రీను, తిమ్మయ్య, రవి, రాజన్న, పాపయ్య, క్రిష్ణప్ప పాల్గొన్నారు.

పీలేరు : దళితుల ఐక్యతను దెబ్బతీసే విధంగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృతతేజ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్‌బంద్‌లో భాగంగా బుధవారం పీలేరు పట్టణంలో వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బద్దె భానుప్రకాష్, దుర్గాప్రసాద్, బోదేషా, సాధిక్, రాజేశ్వరి, హేమలత, జయరామచంద్రయ్య, మల్లికార్జున, సదాశివకుమార్, సాయిసంపత్, లోకనాథం, రెడ్డెప్ప, రవి పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాయింట్ సెక్రెటరీ వీరణాల మాణిక్యం అన్నారు. సోమవారం మాల మహానాడు నాయకులతో కలిసి ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ భారత్ బంద్‌కు సంఘీభావం ప్రకటించి,బంద్ పాటించారు. కార్యక్రమంలో సుధాకర్, సహదేవ, జగదీష్, జయన్న గంగులప్ప, రాజు, సుధాకర, రమణ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ రామసముద్రం మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం బంద్ నిర్వహించారు. బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. నాయకులు కృష్ణప్ప, భాస్కర్, మెకానిక్ వెంకటేష్, శివ, సత్యనారాయణ, రమణప్ప, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : ఎస్సీల వర్గీకరణకు నిరసనగా మాల మహానాడు నాయకులు నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో దార్ల నరసింహులుం, హరికృష్ణ సబ్జి, శ్రీరాములు, విశ్వనాథ్, సురేంద్ర, రామాంజులు, సలాడి రామాంజులు పాల్గొన్నారు.

కలకడ : ఎస్సీ వర్గీకరణకు హేతుబద్ధతలేదని మాల మహానడు ఐక్యవేదిక మండలశాఖ అధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. బుధవారం భారత్‌బంద్‌కు మద్దతుగా కలకడలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

మద్యం విక్రేత అరెస్ట్

బి.కొత్తకోట : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ బొజ్జినాయక్ బుధవారం తెలిపారు. మండలంలోని సూరపువారిపల్లె పంచాయతీ కొత్తవుడియంకు చెందిన లక్ష్మీనారాయణ(59) కర్ణాటక మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకుని దాడులు నిర్వహించగా 115 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

పెద్దతిప్పసముద్రం : జూదం ఆడుతున్న నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని సంపతికోట పంచాయతీ ముంతపోగులవారిపల్లి సమీప పొలాల్లో పేకాట జోరుగా సాగుతోందని కొందరు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారన్నారు. దీంతో సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించామన్నారు. రూ.3,150 నగదుతో పాటు నలుగురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నేరాలు అరికట్టేందుకు కృషి చేయాలి

తంబళ్లపల్లె : మండలంలో నేరాలను అరికట్టేందుకు కృషి చేయాలని ములకలచెరువు సీఐ రాజారమేష్ అన్నారు. బుధవారం తంబళ్లపల్లె పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. నేరాలు, అసాంఘి కార్యక్రమాలు తదితర అంశాలపై ఎస్‌ఐ లోకేశ్వర రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కలర్ గ్రానైట్ మైన్స్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

మదనపల్లె : మండలంలోని కోటవారిపల్లె పంచాయతీ ఉడుంవారిపల్లె సమీపంలో ఏర్పాటు చేయనున్న మంజునాథ్ రాక్స్ కలర్ గ్రానైట్ మైన్స్ కోసం బుధవారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. మైన్స్ ప్రతిపాదిత స్థలంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి డీఆర్వో సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జిల్లా అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఖాజాబీ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో సత్యనారాయణ మాట్లాడుతూ మదనపల్లె గ్రామం (కోటవారిపల్లె) పంచాయతీ సర్వేనెం.350లో 6.726 హెక్టార్లు విస్తీర్ణంలో రూ.60 లక్షల వ్యయంతో మంజునాథ్ రాక్స్ యాజమాన్యం క్వారీ నిర్వహించేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. క్వారీ ఏర్పాటుపై ఏవేని అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు తెలపాలన్నారు. ఆర్ఐ రెడ్డెప్ప, సర్వేయర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దేవదాయ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు

బి.కొత్తకోట : త్వరలో ప్రారంభంకానున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని దేవదాయ భూములపై ఫిర్యాదులు చేసి సమస్యలను పరిష్కరించుకునే చర్యలు చేపట్టామని దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఒక ఈఓ లేదా ఇన్స్‌పెక్టర్ లేక పోతే ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను గుర్తించి వారిని దేవదాయశాఖ అధికారిగా పేర్కొంటూ భూముల వివరాలపై అవగాహ కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 1,649 ఆలయాలు ఉండగా 1,370 ఆలయాలకు 9,761.3 ఎకరాల మాన్యం భూములు ఉన్నట్లు చెప్పారు.

అకాల వర్షంతో పంటలకు నష్టం

పెద్దతిప్పసముద్రం : మండలంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడుకుని భారీ వర్షం కురిసింది. మండలంలో 54 మి.మీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు బుధవారం పేర్కొన్నారు. వర్షం కారణంగా చిన్న చిన్న కుంటలు, చెక్‌డ్యాంలు నీటితో నిండుకున్నాయి. టమాటా, మొక్కజొన్న, దానిమ్మ లాంటి పంటలు దెబ్బతి న్నాయి.

క్లుప్తంగా

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

కలకడ : పశువులకు సోకే గాలికుంట వ్యాధి నివారణకు ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశువర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ మాల కొండయ్య సూచించారు. బుధవారం మండలంలో ని కె.బాటవారిపల్లె పంచాయతీ నీలప్పగారిపల్లెలో పశువైద్యాధికారులు అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ లోకేష్, డాక్టర్ రవికుమార్, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

నిమ్మనపల్లె డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి

నిమ్మనపల్లె : మదనపల్లె నుంచి నిమ్మనపల్లెకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మండల టీడీపీ నాయకులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రిరాంప్రసాద్ రెడ్డిని కోరారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి నిమ్మనపల్లె సమస్యలపై వివరించారు.గత కొన్ని సంవత్సరాలుగా నిమ్మనపల్లె మదనపల్లె డబ్బులు నిర్మాణం పూర్తి కాకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. డబుల్ రోడ్డు నిర్మాణం కందూరు వరకు పొడిగించాలని విన్నవించారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలే కీలకం

పెద్దతిప్పసముద్రం : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలే కీలకమని ఎంపీడీఓ కేఎస్ బాలాజీ అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులకు మూడు రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. పీటీఎం, కురబలకోట మండలాల ఈవోఆర్డీలు యోగానంద, అబ్దుల్ షకూర్, సురేష్‌రెడ్డి, మనోహర్‌లు సర్పంచ్‌లకు పాలనా విధానంపై అవగాహన కల్పించారు.

నిధుల వినియోగంపై వాగ్వాదం

రామసముద్రం : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా యూడీసీ లక్ష్మీనారాయణ మధ్య నిధుల వినియోగంపై వాగ్వివాదం చోటు చేసుకుంది. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటు ప్రజాప్రతినిధులను గౌరవించకపోవడంపై ఎంపీపీ కూడా యూడీసీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కాంట్రాక్టర్ నాగేశ్వరరెడ్డి, సునీత వెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు బెడ్‌షీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పథకం అమలు

తంబళ్లపల్లె : ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు కృషి చేయాలని పీడీ మద్దిలేటి ఆదేశించారు. మంగళవారం రాత్రి వరకు జరిగిన ఉపాధిహామీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. మండలంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 10.38 కోట్లతో చేపట్టిన 1,447 పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించి లోటు పాట్లను గుర్తించారు. బహింగసభలో తనిఖీ నివేదికలను వెల్లడించారు. పలు చోట్ల అవకతలకపై రూ.86,987 రికవరీకి పీడీ ఆదేశించారు.

సీఐగా రాజారమేష్ బాధ్యతల స్వీకరణ



ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ సీఐగా రాజా రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సత్యసాయి జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న తమ్మిశెట్టి మధు అన్నమయ్య జిల్లా హెడ్ క్వార్టర్ వీఆర్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన రాజా రమేష్ మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని మండలాల్లో సాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం, ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ములకలచెరువు: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం ఎస్ఐ గాయత్రి సీజ్ చేశారు. వివరాలిలా.. మండలంలోని వేపూరి కోట నుంచి మొలకలచెరువుకు రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా దాడులు నిర్వహించి సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ

మదనపల్లె సిటీ : హిందువులపై జరుగుతున్న మారణహోమాన్ని నిరసిస్తూ బుధవారం హిందు చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. స్థానిక సొసైటీ కాలనీ నుంచి బెంగళూరు బస్టాండు వరకు ర్యాలీ జరిగింది. బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలపై, హిందూ స్త్రీలపైన జరుగుతున్న మారణ హోమాన్ని నిరసించారు. బీజేపీ నాయకులు బర్నేపల్లి రవి కుమార్, కోసూరి భవానీ, బాలజ్యోతి, వీహెచ్‌పి శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పీలేరు రూరల్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని పి. తేజశ్వని అన్నారు. బుధవారం పట్టణంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల నందు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారా, ఏవైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 12 గిరిజన వసతి గృహాలు, పాఠశాలలు, 1870 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సురేష్, ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్సు తప్పనిసరి

కలికిరి : నర్సరీలకు లైసెన్సు తప్పనిసరి అని ఉద్యానశాఖ అధికారి సుకుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నర్సరీలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 23 నర్సరీలున్నాయని, వీటిలో 21 నర్సరీలకు ప్రభుత్వం లైసెన్సు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా రెండు నర్సరీలకు లైసెన్సు లేక పోవడంతో యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. నర్సరీ యజమానులు తప్పకుండా స్టాకు రిజిస్టరు, బిల్లు పుస్తకం నిర్వహించాలని, నారు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ప్రధానంగా బొప్పాయి నారుకు సంబంధించి జె15 రకం నారు విక్రయించరాదన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

గుర్రంకొండ : రోడ్డు ప్రమాదాల నివాణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న అన్ని విద్యాలయాల వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. బుధవారం స్థానిక ఎస్‌హెచ్ 340 జాతీయ రహదారికి పక్కనే ఉన్న తెలుగు జెడ్పీ హైస్కూల్ వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు జావీద్, రమేష్, త్రినాథ్‌రావ్, హర్షవర్ధన్‌రెడ్డి, మదన్మోహన్, అరవింద్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ స్టేషన్ తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్

మదనపల్లె : పట్టణంలోని ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌ను అనంతపురం నోడల్ ఆఫీసర్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ సందర్శనలో భాగంగా కార్యాలయంలోని రికార్డులు, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు, ప్రాపర్టీని తనిఖీ చేశారు. రాష్ట్రప్రభుత్వం ఎస్ఈబీ(ప్రొహిబిషన్, ఎక్సైజ్)ను ఎక్సైజ్‌శాఖలోకి విలీనం చేస్తున్న నేపథ్యంలో రికార్డులు సరిచూసుకోవాల్సిందిగా సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌రెడ్డి, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువు: స్థానిక ఎస్ఈబీ కార్యాలయాన్ని అనంతపురం జోన్ ఎస్ఈబీ కమిషనర్ విజయ శేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, సీజ్ చేసిన మద్యం పరిశీలించారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ప్రేమలత అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏల ద్వారా రైతులు ఈ-పంట నమోదును ఖచ్చితంగా చేయించుకోవాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల వర్తింపు, ధాన్యం కొనుగోలుకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. పంట నమోదు వల్ల ప్రభుత్వ రాయితీలు, ఇన్సూరెన్స్, పంట రుణాల మంజూరు లాంటివి రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు.

డ్రగ్స్, ఈవ్‌టీజింగ్‌తో అనర్థాలు

కలకడ : డ్రగ్స్, ఈవ్‌టీజింగ్‌తో యువత పూర్తిగా నష్టపోతారని సీఐ గురునాథ్, ఎస్ఐ రామాంజనేయులు అన్నారు. బుధవారం కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. మైనర్‌లు ద్విచక్ర వాహనాలు, కార్లు నడపటం, త్రిపుల్ రైడింగ్ వంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని సూచించారు.